# 32. విరుగుడు

ఈ విశాల విశ్వంలో అంటు వ్యాధులకు ఏం తక్కువా? డాక్టర్లకూ శాస్త్ర పరిశోధనలకూ తెలియని అంటువ్యాధులు ఎన్నో ఉన్నవి. అన్నిటికీ మందులు లేవన్నది మాత్రం నిజం.

ఆ రకం వ్యాధుల్లో ఒక దానికి సూర్యనారాయణ గురయ్యాడు. ఏ క్షణాన అతనికి సినిమాతీయాలనే పిచ్చ పట్టిందో సరిగ్గా చెప్పలేంకాని – ఒక డైరెక్టర్ కావాలనే పట్టుదల నానాటికీ హెచ్చు కాజొచ్చింది. ఐతే అనుభవ శూన్యంగా చిత్రం తియ్యాలంటే కష్టమే కాకుండా, తనను ఎవరూ నమ్మరు. అందుకని, కొంత డబ్బు తగలేసి – రెండు సంవత్సరాలపాటు మెడ్రాస్‌లో ఉండి – ఒక ఫిలిం కంపెనీ వాళ్ళను బతిమాలి భంగపడి పని నేర్చుకున్నాడు. అంత కన్న పని నేర్చుకున్నాను, అని తను అనుకున్నాడు– తనకు అనుభవం ఉన్నదనే విషయాన్ని ఇతరులు నమ్మే అవకాశం కలిగిందనే నమ్మకం అతనికి కలిగింది.

తను నిరభ్యంతరంగా చిత్రం తీసెయ్యగలడు. చాలా మంది డైరెక్టర్ల కన్న బాగా తియ్యగలడు. అన్ని హంగులూ తనదగ్గర ఉన్నాయ్. కాని ఒక్క డబ్బుమాత్రం కావాలి.

తను తలపెట్టిన చిత్రనిర్మాణ కార్యక్రమాన్ని వీలైనన్ని తావుల్లో ప్రచారం చెయ్యటం మొదలుపెట్టాడు. తను ఇవ్వాళో రేపో డైరెక్టరు కాబోతున్నాడనే నమ్మకాన్ని బంధుమిత్రుల్లో రేకెత్తించాడు. అంతకన్నా – తను నిజంగా డైరెక్టరే అయినట్టుగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

అతన్ని నమ్మినవాళ్ళంతా ఆశ్రయింపులు మొదలుపెట్టారు. తను చేయబోయె చిత్రనిర్మాణంలో ఉన్నవీ లేనవీ - అన్నిరకాల ఉద్యోగాలకూ తన ఇష్టుల్నీ అయిష్టుల్నీ కూడా ముందుగానే నిర్ణయించేశాడు.

జ్ఞాపకశక్తి తక్కువకావటంవల్ల ఒక్కో ఉద్యోగాన్ని నలుగురికీ అయిదుగురికీ కూడా ఇవ్వటం సంభవించింది. ఐతే నిజమైన ఉద్యోగాలు కాకపోవటం వల్ల అంత ఇబ్బందిమాత్రం కలగలేదు.

నిజానికి కావలసింది డబ్బు. ఆ సంగతి ఎక్కడపడితే అక్కడ వాగేందుకు వీల్లేదు. ఏ పుణ్యాత్ముడన్నా తన అభ్యుదయకరపథాన్ని జాగ్రత్తగా అర్థం చేసుకొని పెట్టుబడి పెడతాడేమోనని ఎదురుచూడసాగేడు.

సూరి అదృష్ట జాతకుల్లోనేలెక్క. తను ఊహించినట్టే మూర్తితో పరిచయం కలగటం సంభవించింది. మూర్తి అనేక వ్యాపారాలు చేస్తున్నవాడూ బాగా డబ్బున్నవాడూ కావటమే సూరిని ఆకర్షించింది. మూర్తికి అనుభవం లేనిదల్లా ఒక్క సినిమావ్యాపారమే కావడంవల్ల సూరి వాగుడు బాగాపనిచేసే అవకాశం ఏర్పడ్డది. ఐతే మూర్తిని వొప్పించేందుకు యమయాతనలూ పడవలసి వచ్చింది. మూర్తికి సినిమావ్యాపారం తెలియకపోయినా వ్యాపారంలోని లగువు దిగువుల్ని తూచగల సామర్థ్యం వుంది. అందుకనే అనేక అడ్డుప్రశ్నలు వేసి తన అనుమానాల్ని తీర్చుకుం టూండేవాడు. సూరికి ఇదంతా తలనొప్పి వ్యవహారంగా వున్నా మూర్తిని వొప్పించవలసిన అవసరం వుంది కనుక విసుగును కనపడనీయకుండా ఓర్పుతో జవాబులు చెప్పేవాడు.

“యీమధ్య తీసే చిత్రాలన్నీ కాశీమజిలీ కథలే! మనం అరేబియన్ నైట్స్ లోవి మొదలుపెట్టినా - మూడుతరాలకు సరిపడే కథలున్నవి...’

“ఇది మంచి ఊహే-”

“ఇంకోటి ఇప్పటి ప్రేక్షకులకు కావలసింది చిన్నచిత్రం. అంటే పదివేల అడుగుల్లోనే చిత్రాన్ని పూర్తిచెయ్యటం అత్యవసరం. అందువల్ల మనకు చాలా లాభాలున్నవి.”

“ఏమిటవ్వి?”

“చిత్రం పొడుగు తక్కువకనుక మనకు ఖర్చు తగ్గుతుంది. ఇంకోటి ఏమిటంటే - మనకు దొరికే టెక్నీషియన్స్ అందరూ దిట్టలని చెప్పేందుకు వీల్లేదు. ఎన్నో లోపాలు చిత్రంలో ఉండొచ్చు. ఐతే తక్కువ పొడవున్న చిత్రం తీస్తున్నాం కనుక లోపాలసంఖ్య కూడా తగ్గిపోతుంది.”

“నిజమేకాని దీని మీద నాకు చాలా మంచిఊహ కలిగింది.”

“చెప్పండి.”

"ఏంలేదు. మనం అసలు చిత్రమే తియ్యకుండా ఉంటామనుకోండి. అప్పుడు మన కేమీ ఖర్చు ఉండదు. పెట్టుబడి అసలు లేదు కనుక మనకొచ్చే నష్టమేమీ ఉండదు. లాభం రానే రాదు కనుక ఇన్‌కమ్‌టాక్స్ కట్టక్కర్లేదు. ఇంకోటి ఏమిటంటే – చిత్రమే తియ్యంకనుక మనం తీయనిచిత్రంలో లోపాలనేవి ఉండేందు కేమీవీలులేదు. విమర్శకుల కలాలకు మనం భయపడక్కర్లేదు. కనుక–"

యీ చిటకా సూరికి బాగా పనిచేసింది. అతనికి తగిలిన అంటువ్యాధి దెబ్బతో వొదిలింది. తను తీయనిచిత్రానికి తప్పులేచేయని డైరెక్టర్ అయినంత ఆనందంగా తోచింది. ఐతే ఆనాటినుంచీమాత్రం అతను - తనలాటి అనేకమంది డైరెక్టర్ల దగ్గర సినిమా ప్రశంసమాత్రం తెచ్చేవాడు కాదు.

– *ఫిబ్రవరి, 1948*